సాగర తీరానికి కొత్తశోభ


నాడు : అధ్వానంగా సాగర్‌నగర్ గెడ్డ


నేడు : మొక్కలు, కొబ్బరి చెట్లు నాటడంతో సుందరంగా మారిన గెడ్డ

- మొక్కలు, కొబ్బరి చెట్లు నాటిన జీవీఎంసీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న పర్యాటకులు

కొమ్మాది: అందమైన సాగరతీరమని అక్కడకు వచ్చే పర్యాటకులకు దుర్వాసన, వ్యర్థాలు స్వాగతం పలికేవి. ఇది కొద్ది రోజుల కిందటి వరకూ పరిస్థితి. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సాగర్‌నగర్ బీచ్ సుందర పర్యాటక కేంద్రంగా రూపురేఖలు మారిపోతున్నాయి. ఇక్కడి తీర ప్రాంతం కొత్త శోభను సంతరించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జి – 20 సదస్సు నేపథ్యంలో వైజాగ్ తీర ప్రాంతాన్ని సుందరీకరిస్తున్నారు. ఇందులో భాగంగా అనేక బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలో భీమిలి బీచ్ రోడ్డు, సాగర్‌నగర్ బీచ్‌ను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ విశాలమైన తీరప్రాంతం ఉండడంతో పండగలు, ఇతర సెలవు దినాల్లో వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ బీచ్ సమీపంలో గెడ్డను మట్టితో కప్పివేసి చుట్టూ కొబ్బరి చెట్లు, ఇతర మొక్కలు నాటారు. అదే విధంగా విద్యుత్ లైట్లు, డస్ట్‌బిన్‌లు, పర్యాటకులు సేద తీరేందుకు బెంచీలు ఏర్పాటు చేయడంతో ఇది మన సాగర్‌నగర్ బీచేనా అని స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. ఏదేమైనా ప్రస్తుత ప్రభుత్వం పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడంపై పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బీచ్‌ల అభివృద్ధితో పర్యాటకులు పెరగడం వల్ల జీవనోపాధి దొరుకుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాంటేషన్ పనులు సకాలంలో పూర్తి చేయండి

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు


బీచ్‌రోడ్డులో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

కొమ్మాది: నగర సుందరీకరణ పనుల్లో భాగంగా ప్లాంటేషన్ పనులు సకాలంలో పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ అధికారులకు సూచించారు. జి – 20 సదస్సు నేపథ్యంలో బీచ్ రోడ్డు, చేపలుప్పాడ, తొట్లకొండ, రుషికొండ బీచ్, మంగమారిపేట బీచ్ ప్రాంతాల్లో జరుగుతున్న సుందరీకరణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో చేపడుతున్న సుందరీకరణ పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలినవి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు పనులు, సెంట్రల్ మీడియంకు రంగులు వేసి పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. రోడ్డు సెంట్రల్ మీడియంలో ప్లాంటేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు సంతృప్తికరంగా చేపట్టారనన్నారు. రానున్న రోజుల్లో ఇంకా మెరుగ్గా నిర్వహించాలని, బహిరంగ మల, మూత్ర విసర్జన చేపట్టకుండా, వ్యర్థాలు వేయకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయనతోపాటు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి డి.సురేష్ కుమార్, జెడ్సీ కనకమహా లక్ష్మి, పర్యవేక్షణ ఇంజినీర్ శ్యాంసన్‌రాజు, డీసీపీ పద్మజ, ప్రజారోగ్య సిబ్బంది ఉన్నారు.

సత్యకు నీట్ పీజీ సెట్‌లో 986వ ర్యాంకు



పద్మనాభం: మండలంలోని శేరిఖండం గ్రామానికి చెందిన పల్లంటి సత్య చైత్ర మంగళవారం రాత్రి విడుదల చేసిన నీట్ మెడికల్ పీజీ సెట్‌లో 628 మార్కులతో ఆల్ ఇండియా స్థాయిలో 986వ ర్యాంకు సాధించింది. హైదరాబాద్‌లోని భాస్కర మెడికల్ కాలేజీలో ఆమె ఎంబీబీఎస్ చదివారు. తండ్రి పల్లంటి చిన్నారావు శేరిఖండం గ్రామ సర్పంచ్. తల్లి హేమ జ్యోతి గృహిణి. సత్యచైత్రను పలువురు అభినందించారు.

క్లుప్తంగా

పోలమాంబ ఆలయంలో అన్నదానం


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

తగరపువలస: సంగివలస పోలమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈవో పి.ఎస్.ఎన్.మూర్తి ప్రారంభించారు. నగరానికి చెందిన శ్రీహరి సేవా సమితి సభ్యులు సహాయ సహకారాలు అందించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 4 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సిబ్బంది తాటికొండ రాంబాబు, కోరాడ శ్రీను, అర్చకులు నరసింహమూర్తి, ఏడిద రామకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గీతంలో న్యూ హ్యాంప్‌షైర్ వర్సిటీ బృందం


వర్సిటీ బృందంతో గీతం ప్రతినిధులు

కొమ్మాది: అమెరికాలోని ప్రసిద్ధ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆఫ్ న్యూ హ్యాంప్‌షైర్ అకడమిక్ నిపుణుల బృందం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని బుధవారం సందర్శించింది. న్యూ హ్యాంప్‌షైర్ డీన్ మైక్ డిసెల్లే, గ్యాడ్యుయేట్ స్కూల్ డీన్ మేడిసన్ ఫెరేరి, గీతం ఇంజినీరింగు సీనియర్ ప్రొఫెసర్లు, డీన్‌లతో సమావేశమై బోధన, పరిశోధన అంశాలపై చర్చించారు. తమ విశ్వవిద్యాలయాలు నిర్వహిస్తున్న కోర్సులను వివరించారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో యువతలో సేవాభావం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కొమ్మాది: జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ద్వారా యువతలో సేవా భావం, సమాజం పట్ల బాధ్యత పెరుగుతుందని గీతం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం అన్నారు. గీతం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తం అందించడం ద్వారా ప్రాణాలు నిలుస్తున్నాయన్నారు. రక్తదానం చేసేందుకు యువతీ యువకులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగులే మేలు

సీతమ్మధార: ప్లాస్టిక్, పాలిథిన్‌కు బదులుగా గుడ్డ సంచులు వాడటం మంచిదని జీవీఎంసీ జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి సూచించారు. సీతమ్మధార రైతుబజార్‌లో బుధవారం ప్లాస్టిక్ సంచులను నిషేధించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రతి కూరగాయల స్టాల్ వద్దకు ఆమె వెళ్లి ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం వల్ల కలిగే నష్టాలను వ్యాపారులకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వినియోగం హానికరమన్నారు. పర్యావరణానికి మేలు చేసేలా ప్రతి ఒక్కరూ క్లాత్ బ్యాగులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులు వాడితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రైతుబజార్ ఆవరణలోని పండ్ల దుకాణాల్లో వినియోగిస్తున్న సంచులను జెడ్సీ పరిశీలించి గుడ్డ సంచులనే వినియోగదారులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయిగణపతి విద్యార్థికి అభినందనలు


ఈశ్వర్ వర్ధన్‌ను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ఆనందపురం : మండలంలోని గిడిజాలలో ఉన్న సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి ఇటీవల జరిగిన ఆలిండియా సౌత్ జోన్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో కాంస్య పతకం సాధించినట్టు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించిన పాలిటెక్నిక్ విద్యార్థి ఎస్.ఈశ్వర్ వర్ధన్ కాంస్య పతకాన్ని సాధించాడు.

ఈ మేరకు కళాశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాల్, ప్రిన్సిపాల్ ఎల్.మహేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటరాజు తదితరులు ఈశ్వర్ వర్ధన్‌ను బుధవారం అభినందించారు. ఆ విద్యార్థిని యువకులంతా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

వైభవంగా పూర్ణ కలశం పునఃప్రతిష్ట


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పద్మనాభం: మండలంలోని పాత కొవ్వాడలో రామాలయ శిఖరంపై పూర్ణ కలశాన్ని బుధవారం వైభవంగా పునః ప్రతిష్ఠించారు. పాత పూర్ణ కలశం ఇటీవల గాలికి విరిగిపోయింది. దీంతో గ్రామస్తులు, గ్రామ పెద్దలు ముందుకొచ్చి పూర్ణ కలశం పునఃప్రతిష్ఠకు శ్రీకారం చుట్టారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ పూర్ణ కలశాన్ని పునః ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో లగుడు బంగారునాయుడు, వెంకినాయుడు పాల్గొన్నారు.

నురగలు కక్కుతున్న కాలుష్యం


నురగులు కక్కుతూ గెడ్డలో ప్రవహిస్తున్న కలుషిత నీరు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో గెడ్డనీరు కలుషితమవుతోందని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మారికవలస, కొమ్మాదిలో గల కొన్ని సీ ఫుడ్స్ కంపెనీలు కలుషిత నీరును నేరుగా వదిలివేయడంతో మారికవలస నుంచి కాపులుప్పాడ గెడ్డలోకి కలిసిపోతోంది. దీంతో నీరు కలుషితమవ్వడమే కాకుండా తీవ్ర దుర్వాసన వస్తోంది. మంగళవారం ఈ గెడ్డ వద్ద భారీ ఎత్తులో కలుషిత నీరు నురుగులు కక్కుతున్న దృశ్యం చూసి స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే కలుషిత నీరు సమీపంలోని పంట పొలాలతోపాటు నగరపాలెం నుంచి ప్రవహించే గెడ్డ ద్వారా నేరుగా సముద్రంలో కలవడంతో ఆ నీరు కూడా కలుషితమవుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తైక్వాండో జాతీయ పోటీలకు మధురవాడ క్రీడాకారులు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు, కోచ్‌లు

మధురవాడ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు మధురవాడకు చెందిన 10 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల యలమంచిలిలో సబ్ జూనియర్ క్యాడెట్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. వీటికి మధురవాడ నుంచి 14 మంది క్రీడాకారులు హాజరుకాగా 10 మంది బంగారు, ఒకరు కాంస్య పతకం సాధించారు. వీరిలో 10 మంది ఈ నెల 28 నుంచి 31 వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మధురవాడ యూత్ తైక్వాండోకు చెందిన జి.భాషిత, ఎ.నిత్యశ్రీ, పి.జ్ఞానశ్రీ, కె.ధనలక్ష్మి, కె.మహేశ్వరరావు, పి.సుధీర్, ఎన్.విశాల్, పి.జశ్వంత్ సాయిసూర్య, ఎ.వివేక్ అభిసాయి, టి.మణికంఠ బంగారు పతకాలు గెలుచుకున్నారు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మధురవాడకు చెందిన శ్రీ కనక దుర్గా క్యాటరింగ్ అండ్ సప్లయిర్స్ నిర్వాహకులు కొత్రాయి సురేష్ ఆర్మీ గార్స్, చికెన్ గార్స్ బుధవారం బహూకరించారు. విజేతలను మధురవాడ యూత్ తైక్వాండో కోచ్‌లు సురేష్, సుకుమార్, సంపత్ తదితరులు అభినందించారు.

సెయిల్‌లో విలీనంతో స్టీల్‌ప్లాంట్‌కు భవిష్యత్

ఎంపీలకు ఉక్కు అధికారుల సంఘం లేఖలు


ఎంపీలకు రాసిన లేఖలను ప్రదర్శిస్తున్న స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ రావు, సీ ప్రతినిధులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా సెయిల్‌లో విలీనం చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ప్రైవేటీకరణ తప్పదని ప్రకటించిన నేపథ్యంలో బుధవారం సీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో లోక సభ, రాజ్యసభ ఎంపీలకు పెద్ద సంఖ్యలో లేఖలు రాశారు. ఆ లేఖల్లో ప్రైవేటీకరణ ప్రత్యామ్నాయం, సెయిల్‌లో విలీనం, వాటి ఉపయోగాలు, ఉక్కు పరిశ్రమ అభివృద్ధి, కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ లక్ష్య సాధన, ఉద్యోగాల కల్పన, రిజర్వేషన్లు అమలు వంటి అంశాలను వివరించారు. తక్కువ పెట్టుబడితో ఉక్కు సామర్థ్యం పెంపు గురించి లేఖల్లో వివరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ (ఆపరేషన్స్) కె.కె.రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కుతో ఆంధ్రులకు చాలా అనుబంధం ఉందన్నారు. సెయిల్ నుంచి విడదీసిన విశాఖ ఉక్కును తిరిగి విలీనం చేయడం ద్వారా లాభదాయకమైన ఉత్పాదనకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, ఉపాధ్యక్షులు చంద్ర వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి నరసింహతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గొట్టిపల్లి – కుసులువాడ రోడ్డుకు కొత్తరూపు


నాడు : గోతుల్లో వర్షం నీరు చేరి అధ్వానంగా మారిన గొట్టిపల్లి రోడ్డు


నేడు : పునర్నిర్మించడంతో అద్దంలా మారిన గొట్టిపల్లి రోడ్డు

రూ.40 లక్షలతో పునర్నిర్మాణంతో తొలగిన ఇబ్బందులు

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి – కుసులువాడ రోడ్డుకు పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టడంతో కొత్త రూపు సంతరించుకుంది. చాలా కాలం క్రితం నిర్మించిన తారు రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణమంటేనే వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో గొట్టిపల్లి గ్రామం వద్ద పలు చోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వరద నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. పలుచోట్ల రాళ్లు తేలి రాకపోకలకు అంతరాయంగా మారింది. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో రోడ్డుని పూర్తిగా పునర్నిర్మించడంతో ఈ ప్రాంత వాసుల ఇబ్బందులు తొలిగాయి. ముకుందపురం, చిన్నయ్యపాలెం, రేగానిగూడెం, గొల్లలపాలెం గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా మారింది. దీంతో ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

కొమ్మాది: రుషికొండ గాయత్రి కళాశాలలో డిగ్రీ, పీజీ విద్యార్థుల కోసం అంతర్జాతీయ వినియోగదారుల హక్కులపై అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ సింహపురి యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఆర్.సుదర్శనరావు పాల్గొని ప్రసంగించారు. వినియోగదారుల హక్కులను రూపొందించడంలో అమెరికా మాజీ ప్రెసిడెంట్ జాన్ ఎఫ్ కెన్నడీ పాత్ర ఎంతో విశిష్టమైందన్నారు. హక్కులపై అందరికీ అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఐఐపీఏ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు, కళాశాల ప్రిన్సిపాల్ రజిని, తదితరులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో చండీ హోమం


చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో ఫల్గుణ మాసం, బహుళ అష్టమి సందర్భంగా బుధవారం వేద పండితులు శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు. లోక కల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా ఈ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. మాస శివరాత్రి సందర్భంగా ఈ నెల 20న కాశీ కాలభైరవులకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమావాస్య సందర్భంగా 21న శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుపుతామని, పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై ఈ నెల 13న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే పంచాయతీ యాతపేటకు చెందిన గంటా శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీను తగరపువలస వెళ్లేందుకు ఆటో కోసం జాతీయ రహదారి దాటుతుండగా శ్రీకాకుళం వైపు నుంచి ఆనందపురం వస్తున్న వ్యాను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడిపోయిన శ్రీను తల, కాళ్లు, చేతులకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. క్షతగాత్రుని కుమారుడు నరేంద్ర ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునిక మందులతో క్షయ నియంత్రణ


మధురవాడలో ర్యాలీలో వైద్యులు, సిబ్బంది


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది

ఆనందపురం : క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, ఆధునిక మందులు, వైద్యంతో నయమవుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కోరాడ శైలజ అన్నారు. మండలంలోని లొడగలవానిపాలెం, బోయిపాలెం గ్రామాల్లో బుధవారం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి చికిత్సకు ఆధునిక మందులు అందుబాటులో ఉండడంతో పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు.

రెండు వారాలు పైబడి దగ్గు ఉన్నా, మెడపై కణితలు ఉన్నా క్షయగా అనుమానించి తనిఖీ చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆశ కార్యకర్తల ద్వారా ఉచితంగా మందులు అందజేస్తామని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఐ.గోవిందరావు, కార్యదర్శి అనురాధ, ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, హెచ్‌ఎం వై.వి.రావు, ఆరోగ్య పరిరక్షణ అధికారి ఎన్.వి.రమణ, సీహెచ్‌వో ఎన్.సాయి గౌతమి, సురేష్ కుమార్, అరుణ కుమార్ పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు, మందులు ఉచితం

మధురవాడ: టీబీ వ్యాధికి పరీక్షలు, మందులు ఉచితం అనే నినాదంతో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్టు మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దీపిక అన్నారు. మధురవాడ పీహెచ్‌సీ నుంచి సిబ్బంది, వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టీబీ, ఇతర వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని, ప్రాథమిక దశలోనే గుర్తించడం వల్ల నివారణ సులువవుతుందన్నారు. సీహెచ్‌వో సౌభాగ్యమణి, సూపర్‌వైజర్‌లు రమణ, సురేష్, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కోరాపుట్–కొత్తవలస లైన్‌లో తనిఖీలు

- అభివృద్ధి పనులు పరిశీలించిన జీఎం మనోజ్‌శర్మ


శివలింగపురం స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న జీఎం మనోజ్ శర్మ, డీఆర్‌ఎం అనూప్‌కుమార్

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ రెండో రోజు బుధవారం కూడా వాల్తేర్ డివిజన్ పరిధిలో గల కోరాపుట్ – కొత్తవలస లైన్లో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సెక్షన్ పరిధిలో కోరాపుట్, అరకు, బొర్రా గుహలు, శివలింగపురం స్టేషన్ల మధ్య సైడింగ్స్, రైల్వే కార్యాలయాలు, స్టేషన్లను తనిఖీ చేశారు. విండో ట్రెయిలింగ్ తనిఖీల ద్వారా మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. కోరాపుట్ – కొత్తవలస సెక్షన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనులు, కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో గల రన్నింగ్ రూం, రెస్ట్ హౌస్‌లను పర్యవేక్షించారు. అనంతరం రన్నింగ్ రూంలో లోకో పైలట్స్, ట్రైన్ మేనేజర్స్‌తో మాట్లాడారు. అరకు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన వన్‌స్టేషన్ – వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను, రెస్ట్‌హౌస్‌లను కూడా పరిశీలించారు. అమృత్‌భారత్ పథకం కింద ఈ స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. చిమిడిపల్లి వద్ద గల టన్నెల్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇటీవల గూడ్స్ రైలు ప్రమాదం జరిగిన శివలింగపురం యార్డ్‌ని పరీక్షించారు. పర్యటనలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భాషా పటిమ అవసరం


మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: రచయితలకు పరిశీలనాశక్తి, గ్రంథపఠనం, భాషా పటిమ అవసరమని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో సాహిత్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, రచయితల సాహిత్య చర్చలకు సహృదయ సాహితి సంస్థ మంచి వేదిక అన్నారు. డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఇటువంటి సాహిత్య చర్చలు కవులు, రచయితలకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. తెలుగు జాతీయాలు, నుడికారం అనే అంశంపై సీహెచ్.చినసూర్యనారాయణ, నంది తిమ్మన పారిజాతాపహరణంపై టీపీఎస్ ఆచార్యులు, స్త్రీవాద సాహిత్యంపై బి.సరోజిని, మల్లాది వెంకటకృష్ణమూర్తి నవలలపై కుప్పిలి భీమేశ్వరరావు, పంచతంత్రంపై కె.జి.వేణు, శేఖరమంత్రి ప్రభాకర్ ప్రసంగించారు. ముందుగా ప్రజా స్పందన అధ్యక్షుడు సి.ఎస్.రావు మృతికి సంతాపం ప్రకటించి మౌనం పాటించారు.